క్లుప్తంగా

ఆర్థిక సాయం



లక్ష్మికి ఆర్థిక సాయం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన పాల్తేరు లక్ష్మికి హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు సభ్యులు రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని గ్రూప్ నిర్వాహకులు గుడ్ల హరిప్రసాద్, బి.గౌరీశంకర రావు (సర్పంచ్), నిమ్మక శేఖర్ (వైస్ ఎంపీపీ), తదితరులు మంగళవారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల ఆమె భర్త పాల్తేరు వరప్రసాద రావు మృతి చెందడంతో ఆమె ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని, నిరుపేద అయిన ఆమెకు తమవంతుగా సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పి.ప్రేమానంద్, బి.మధు, వర్తక, వైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మంచి జీవితం



గంగమ్మపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

వీరఘట్టం: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలిగి ఉన్నతంగా ఎదిగి మంచి జీవితాన్ని నిర్మించుకోవాలని ఎస్‌ఐ షేక్ ఫక్రుద్దీన్ అన్నారు. గంగమ్మపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మంచి, చెడు నడవడికలపై మంగళవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. రెసిడెన్షియల్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు మంచిగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శిథిల బావిని పూడ్చండి



శిథిలమైన నేలబావి వద్ద వేసిన చెత్తాచెదారాన్ని చూపిస్తున్న గ్రామస్తుడు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామంలోని ఎస్సీ వీధిలో శిథిలమైన నేలబావిని పూడ్చాలని గ్రామానికి చెందిన గంట వీరయ్య కోరారు. వీధిలో దాహార్తిని తీర్చేందుకు కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన నేలబావి ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో స్థానికులు చెత్తా చెదారాలను డంప్ చేస్తున్నారని అన్నారు. దీని వల్ల పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోందని, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి శిథిలమైన నేలబావిని తక్షణమే పూడ్చివేయాలని కోరారు.

కొబ్బరి సాగుతో ఆదాయం



కొబ్బరి మొక్కలు నాటుతున్న సర్పంచ్ గౌరీశంకరరావు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: కొబ్బరి సాగు ద్వారా గిరిజన రైతులు ఆదాయం పొందవచ్చని మొండెంఖల్లు సర్పంచ్ ఐ.గౌరీశంకరరావు అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామానికి మంజూరైన కొబ్బరి మొక్కలను గ్రామంలోని తరినాయుడు చెరువుగట్టుపై మంగళవారం నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మథరావుతో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి సాగుతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. రైతులకు విరివిగా కొబ్బరి మొక్కలు పంపిణీ చేయాలని అధికారులను కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు శ్రీహరి, రాజేశ్వరి ఉన్నారు.



పాలకొండ రూరల్: యరకారాయిపురం ఎంపీపీ పాఠశాలలో వాటర్ గేమ్ ఆడుతున్న చిన్నారులు



పాలకొండ రూరల్: కబడ్డీలో తలపడుతున్న బుక్కూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



పాలకొండ రూరల్: హడ్కో కాలనీ ఎంపీయూపీ పాఠశాలలో టగ్‌ఆఫ్ వార్ క్రీడలో విద్యార్థులు

క్రీడా సందడి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో క్రీడా సందడి నెలకొంది. రెండు రోజులుగా ఏ పాఠశాలలో చూసినా విద్యార్థుల ఆటల సందడే కనిపిస్తోంది. పలు రకాల ఆటలను ఆడుతూ సందడి చేస్తున్నారు. ఓ వైపు అవుట్ డోర్ క్రీడలు, మరోవైపు ఇన్‌డోర్ క్రీడలు ఆడిస్తూ ఉపాధ్యాయులు కూడా బిజీగా ఉన్నారు. కబడ్డీ, ఖోఖో, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, వాలీబాల్, క్రికెట్ వంటి పోటీలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ, జానపద నృత్య నాటక, పద్య విభాగాల్లో క్రీడలు నిర్వహిస్తున్నారు. విజేతలకు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నారు.

– పాలకొండ రూరల్/గుమ్మలక్ష్మీపురం



పాలకొండ రూరల్: గొట్ట మంగళాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మ్యూజికల్ చైర్ ఆడుతున్న విద్యార్థినిలు



గుమ్మలక్ష్మీపురం: కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఖోఖో పోటీలు

మరుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్థలు

సీతంపేట: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో టాయిలెట్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 284 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ వరకు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. నాడు–నేడులో రూ.6 లక్షల వరకు నిధులను ఖర్చు చేసినప్పటికీ మరుగుదొడ్లు నిర్మించక అర్ధాంతరంగా వదిలేసారు. మరో రూ.లక్ష ఉంటేగాని మరుగుదొడ్లు పూర్తికావని పాఠశాల యాజమాన్యం తెలియజేస్తుంది. బాలికలకు చాలీచాలని మరుగుదొడ్లు ఉన్నప్పటికీ, బాలురకు పూర్తిగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో టాయిలెట్స్ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిలిచిపోయిన మరుగుదొడ్లు నిర్మాణ పనులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాలకొండ రూరల్: వాహన చోదకులు నిబంధనలు అతిక్రమిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. పాలకొండ – సీతంపేట, విశాఖ ప్రధాన రహదారుల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు మంగళవారం చేపట్టారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఫిట్‌నెస్ లేని వాహనాలు నడపటం, పరిమితికి మించి లోడు, ప్రయాణికులను ఎక్కించటం నేరమన్నారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వటం, డ్రైవింగ్ లైసెన్సులు, వాహన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలతో రోడ్లపైకి రావటం వంటి చర్యలకు స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా స్కూల్ బస్సులకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్టు తెలిపారు.



పాఠశాల బస్సుల ఫిట్‌నెస్ పత్రాలను పరిశీలిస్తున్న ఏఎంవీఐ నవీన్‌కుమార్

బడితోట బాగుంది: ఎంఈఓ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రాథమిక పాఠశాల (స్పెషల్)లో సాగులో ఉన్న బడితోటను ఎంఈవో–1 నాగభూషణరావు మంగళవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఆకుకూరలు సాగు చేయడం బాగుందన్నారు. పండిన కూరగాయలు, ఆకుకూరలను మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వండి పెట్టాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన ఉండాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఎర్రయ్య, వేణుగోపాల్, సుబ్బినాయుడు ఉన్నారు.



బడితోటను పరిశీలిస్తున్న ఎంఈవో

వ్యవసాయ బోర్ల కనెక్షన్ల కోసం వినతి

భామిని: ఖరీఫ్ సీజన్ సమయంలో నీరు లేక సాగుకు ఇబ్బందులు వెంటాడుతున్నాయని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వేసి వ్యవసాయ బోర్లకు తక్షణమే కనెక్షన్లు ఇవ్వాలని నేరడి బీ రైతులు కోరారు. ఈ మేరకు పాలకొండ ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తికి రైతులు మంగళవారం తమ ఇబ్బందులు తెలియజేశారు. వ్యవసాయ బోర్ల కనెక్షన్ల కోసం ఐదు నెలల కిందట నిబంధనల మేరకు విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డబ్బులు చెల్లించామని తెలిపారు. వర్షాభావంతో పంటకు నష్టం లేకుండా తక్షణమే వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఈఈ ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఈఈకి సమస్యలు వివరిస్తున్న నేరడి–బీ రైతులు

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా



తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, తదితరులు

గరుగుబిల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం 'హర్ ఘర్ తిరంగ' ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ చేపట్టారు. స్వాతంత్ర్య పోరాటాన్ని గుర్తుచేసుకుంటూ, ప్రతీ ఒక్కరిలో జాతీయతా భావం పెంపొందించే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టి.రాము, నాయకులు ఎస్.శ్రీనివాసరావు, పి.గౌరునాయుడు, అసోక్, వై.హరీష్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

భామిని: ఉద్యాన ఇతర పంటలు సాగు చేసే రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పైపులు రాయితీపై ఇవ్వనున్నట్టు సీతంపేట ఉద్యానవన శాఖాధికారిణి పేడాడ జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆసక్తి గల రైతులు తమ భూమి ఉన్న రైతు సేవ కేంద్రానికి వెళ్లి భూ వివరాలతో వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 79950 09843 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

విజృంభిస్తున్న జ్వరాలు



భద్రగిరి సీహెచ్‌సీలో ఒకే మంచంపై చికిత్స పొందుతున్న రోగులు

గుమ్మలక్ష్మీపురం: గత కొన్నిరోజులుగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో బాధపడుతున్న వారితో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. మండల కేంద్రంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరిపడా బెడ్లు అందుబాటులో లేకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఆస్పత్రిలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణాలను పూర్తిచేసి మరిన్ని బెడ్లు అందుబాటులోకి తీసుకొస్తే రోగులకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు అంటున్నారు.

ఇంటర్‌లో అదనపు సీట్ల భర్తీ

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల కళాశాలలో అదనపు సీట్లు గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర ఆధ్వర్యంలో మంగళవారం భర్తీ చేశారు. మొత్తం 30 సీట్లకుగాను 28 సీట్లు భర్తీ అయ్యాయి. ఎంపీసీ 8, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 10 చొప్పున సీట్లు భర్తీ చేశారు. కార్యక్రమంలో గురుకులం సెల్ ఇన్‌చార్జి వెంకటరమణ, ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా..

సీతానగరం: మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలైన గంజాయి, డ్రగ్స్, గుట్కా, తంబాకు, వంటి వాటికి బానిసైతే ఆరోగ్యం పాడవుతుందని, భవిష్యత్ అంధకారంగా మారుతుందని వివరించారు. నిషేధిత పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సూచించారు. దీనిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీతానగరం: మండల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని, పెండింగ్ చలానాలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ఎస్సై ఎం.రాజేష్ కోరారు. మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లలో మంగళవారం సాయంత్రం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. సరైన వాహన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వారికి అపరాధ రుసుం విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

నిబంధనలు పాటించాల్సిందే..

సాలూరు: ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులను మంగళవారం తనిఖీ చేశారు. ఆర్‌సీ, ఎఫ్‌సీ, పర్మిట్, ఐసీ, తదితర రికార్డులను కచ్చితంగా వెంట ఉంచుకోవాలని సూచించారు. పరిమితికి మించి పిల్లలను బస్సుల్లో తీసుకువెళ్లరాదని, అటెండెంట్ తప్పకుండా బస్సులో ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమన్వయంతోనే పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులు, సర్పంచ్‌లకు మంగళవారం రెండోరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పరిపాలన అంశాలు, సంక్షేమ పథకాల అమలు విధానాలను ఎప్పటికప్పుడు సర్పంచ్‌లకు తెలియజేయాలని కార్యదర్శులకు సూచించారు. సర్పంచ్‌ల అధికారాన్ని సక్రమంగా అమలు చేసేందుకు సహకరించాలన్నారు. పంచాయతీల్లో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే అన్ని శాఖాధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

సారాతో ఇద్దరి అరెస్ట్

కొమరాడ: మండలంలోని తులసివలస గ్రామానికి చెందిన గన్నెల ఎర్రయ్య, దేశరకృష్ణ సారా అమ్ముతుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. తులసివలస సమీపంలో సారా విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు మాటువేసి పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎరువుల అధిక వినియోగంతో నష్టం

వీరఘట్టం: అధిక మోతాదులో ఎరువులు వినియోగిస్తే పంటకు అనర్థం తప్పదని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.రత్నకుమారి సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం చలివేంద్రి గ్రామంలో గాప్(గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్) కార్యక్రమం ద్వారా రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. సీతంపేట వ్యవసాయ క్షేత్రం సైంటిస్ట్ ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాధారణ ఎరువుల కంటే నానో యూరియా, నానో డీఏపీ వినియోగం వల్ల పంటకు ఎంతో మేలని సూచించారు. చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

దశపర్ణి కషాయంతో చీడపీడల నివారణ

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ మంగళవారం దశపర్ణి కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. పది రకాల ఆకులతో ఈ కషాయాన్ని తయారు చేస్తారు కాబట్టి దీన్ని దశపర్ణ కషాయంగా పేర్కొంటారని వివరించారు. వేప, సీతాఫలం, కాగు, మామిడి, జిల్లేడు, నేరేడు తదితర ఆకులను చూర్ణం చేసి, పచ్చిమిర్చి 50 గ్రాములు, వెల్లుల్లి 50 గ్రాములు మెత్తగా నూరి, పొగాకు కాడలు గుండగా చేసి, పావులీటరు ఆవు మూత్రం, 8 లీటర్ల నీటిలో వీటన్నింటినీ కలిపి 30 నుంచి 45 రోజుల వరకు పులయ బెట్టడం ద్వారా ఈ కషాయాన్ని తయారు చేస్తారన్నారు. దీన్ని పంటలపై పిచికారీ చేయడం ద్వారా కాయతొలుచు పురుగు, రసం పీల్చే పురుగు, పచ్చదోమ, తెల్లదోమ, తదితర చీడపీడలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.ధనుంజయరావు, వై.కృష్ణ, ఎం.సింహాచలం, త్రినాథ, రైతులు పాల్గొన్నారు.



దశపర్ణి కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పక్కాగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు నిర్వహించాలి

సీతంపేట: చెత్త నుంచి సంపద కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీఓ కె.రాంప్రసాద్ అన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలో స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించారు. నిర్వాహణపై అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్డీ సత్యం తదితరులు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్‌లు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పాలకొండ: పట్టణంలోని నాగవంశపు వీధికి చెందిన పల్లా సీతమ్మ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పరామర్శించారు. సీతమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించారు. ఈ మేరకు ఆమె కుమారుడు 9వ వార్డు కౌన్సిలర్ పల్లా బానుబాబును పరామర్శించి ఓదార్చారు. ఆమెతో పాటు కౌన్సిలర్లు నీలాపు శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ కమిషనర్ వై.లిల్లీపుష్పనాధం తదితరులు ఉన్నారు.



సీతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కళావతి